సాక్షి
మహబూబాబాద్

సోమవారం । 23 । డిసెంబర్ । 2024



కాళోజీ జీవితం.. విశ్వవ్యాప్తం

పల్లెటూరు అందాలు, కుటుంబ బంధాలు, అనుబంధాలను మేళవిస్తూ సహజ దర్శక నిర్మాతగా డాక్టర్ ప్రభాకర్ జైనీ చక్కటి సినిమాలకు ప్రాణం పోస్తున్నారు. - 8లో



ఆత్మీయ కలయిక..

జఫర్‌గఢ్ మండలం కూనూరు ఉన్నత పాఠశాలలో 50 ఏళ్ల స్వర్ణోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.1°/17.9°

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి



మహబూబాబాద్ రూరల్: దేశ ప్రజలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని, ఆయన తన పదవికి రాజీనామా చేయాలని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి రాజ్యాంగ సారాంశాన్ని, రాజ్యాంగ ప్రధాన రూపశిల్పి బీఆర్ అంబేడ్కర్‌ను కించ పరిచారని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



మహబూబాబాద్: ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి వెంటనే రెగ్యులరైజ్ చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వీరన్న డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివారం జాతయ గణిత దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వీరన్న మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. రిలే నిరాహార దీక్షలతో పాటు నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఖాదర్, భాస్కర్‌రావు, రవి, గణిత ఉపాధ్యాయురాలు స్వాతి, మున్ని, సరస్వతి, నీలిమా తదితరులు పాల్గొన్నారు.


నేడు కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శన

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శన జరుగుతుందని కేవీకే సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి ఆదివారం తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, నాగ్‌పూర్ సీఐసీఆర్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శన ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా పత్తి పంటకు సంబంధించిన నూతన ఆవిష్కరణలు, వరి, మిర్చి, మొక్కజొన్న, పెసర, మినుములకు సంబంధించి సాగులో మెళకువల గురించి శాస్త్రవేత్తలు వివరిస్తారన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కేయూలో ఐసెట్ కార్యాలయానికి సీల్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలోని ఐసెట్ కార్యాలయానికి రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి తాళం వేసి సీల్ చేశారు. 12 ఏళ్లుగా కాకతీయ యూనివర్సిటీయే టీఎస్‌ఐసెట్ నిర్వహించిన నేపథ్యంలో ఆ కళాశాలలో ప్రత్యేకంగా ఒక హాల్‌ను కార్యాలయంగా ఏర్పాటు చేసి అవసరమైన ఫర్నిచర్, టేబుళ్లు, కంప్యూటర్లు తదితర సామగ్రిని సమకూర్చారు. ఈసారి ఐసెట్ నిర్వహణను ఉన్నత విద్యామండలి కేయూకు అప్పగించకపోవడంతో ఐసెట్ కార్యాలయం నిరుపయోగంగా మారింది. ఈ కార్యాలయం నుంచి రెండు చైర్లు ఎవరో బయటికి తీసుకెళ్లారని ఆరోపిస్తూ రెండురోజుల క్రితం ఒకరు రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లారని సమాచారం. దీంతో ఆయన కళాశాలను సందర్శించి ప్రత్యక్షంగా పరిశీలించారు. అక్కడ స్టాక్ రిజిస్టర్ మెయింటేన్ చేయటంలేదనేది గుర్తించిన రిజిస్ట్రార్.. ప్రస్తుతం ఉన్న ఫర్నిచర్ రిజిస్టర్‌లో పొందుపరిచి కార్యాలయానికి తాళం వేయించారు. అందులోని వస్తువుల జాబితా పత్రాన్ని కళాశాల ప్రిన్సిపాల్ అమరవేణికి అందజేసినట్లు ఆదివారం వెల్లడించారు.

ఐటీడీఏ ఎదుట ధర్నా



ఏటూరునాగారం: ఇటీవల ములుగు జిల్లాలో మావోయిస్టుల చేతిలో హతమైన బాధిత కుటుంబాలు ఏటూరునాగారం మండలకేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట ప్రధాన రోడ్డుపై ఆదివారం ధర్నా నిర్వహించారు. అమాయక గిరిజనులను చంపినప్పుడు రాని మానవ హక్కుల సంఘాల నాయకులు మావోయిస్టులు చనిపోతే ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. మానవ హక్కుల సంఘాల తీరును మావోయిస్టు బాధిత కుటుంబాలు తప్పుబట్టారు. అనంతరం మావోయిస్టుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

స్టాళ్లు ఖాళీ..



తొర్రూరులోని ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ భవనం



మార్కెట్‌లోని రెండో బ్లాక్‌లో తాగి పడేసిన మద్యం సీసాలు

- అంతంత మాత్రంగానే సమీకృత మార్కెట్ వినియోగం
- 96 స్టాళ్లలో 24 మాత్రమే వినియోగం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మోడల్ మార్కెట్

తొర్రూరు: ప్రజల సౌకర్యార్థం కూరగాయలు, మాంసాహారం, చేపలు ఒకేచోట లభించే విధంగా గత ప్రభుత్వం తొర్రూరు పట్టణంలో సమీకృత మార్కెట్‌ను ఏర్పాటు చేసింది. కోట్ల రూపాయలు వెచ్చించి భవనం నిర్మించింది. గతేడాది మార్చి 8న అప్పటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా భవనాన్ని ప్రారంభించారు. కాగా అధికారులు, పాలకులు ప్రత్యేక శ్రద్ధ చూపకపోవడంతో ఆరుబయటనే విక్రయాలు చేపడుతున్నారు. మొదటి బ్లాక్‌లో కూరగాయల విక్రయాల నిమిత్తం 48 స్టాళ్ల ఏర్పాటు చేయగా దానిలో 24 మాత్రమే వినియోగంలో ఉన్నాయి. రెండో బ్లాక్‌లోని 48 స్టాళ్లలో అన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. క్రయవిక్రయదారులు లేక మార్కెట్ వెలవెలబోతుంది.

20గుంటల స్థలంలో..

రూ.4 కోట్ల టీయూఎఫ్‌డీసీ, ప్రణాళిక సంఘం నిధులతో 20 గుంటల స్థలంలో నిర్మించిన సమీకృత మార్కెట్ భవనం ఆశించిన మేర సద్వినియోగం కావడం లేదు. పట్టణంలోని హరిపిరాలకు వెళ్లే రోడ్డులో తాత్కాలిక కూరగాయల దుకాణాలు, ఆయుర్వేద వైద్యశాలను తొలగించి భవనం నిర్మించారు. మొదటి అంతస్తులో కూరగాయలు, రెండో అంతస్తులో మాంసం, చేపలు, మూడో అంతస్తులో షాపింగ్‌మాల్ ఏర్పాటుకు అనుగుణంగా అధికారులు ప్రణాళిక రచించారు. కూరగాయలు, మాంసం విక్రయాలకు అనుగుణంగా రెండు బ్లాకులు నిర్మించారు. నిధుల లేమితో మూడో బ్లాక్ నిర్మాణం నిలిచింది. పాత కూరగాయల మార్కెట్ మొత్తం కొత్త దాంట్లోకి తరలించారు. మొదటి బ్లాకులో 48 స్టాళ్లలో 24 మాత్రమే కొనసాగుతున్నాయి. కూరగాయల విక్రయాలు సరిగా జరగకపోవడంతో ఆరుబయట అమ్మేందుకే వ్యాపారులు మొగ్గుచూపడంతో పలు స్టాళ్లు నిరుపయోగంగా మారాయి. రెండో బ్లాక్‌లోని 48 స్టాళ్లల్లో మాంసం, చేపల విక్రయాలు జరిపేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్నాయి. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి తాజాగా మార్కెట్‌ను సందర్శించి కూరగాయలతో పాటు ఇతర విక్రయాలు జరిపేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కానీ అది కార్యరూపం దాల్చడం లేదు.



ఖాళీగా ఉన్న స్టాళ్లలో పేక ముక్కలు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

మోడల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ రెండో బ్లాక్ ఖాళీగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. భవనం జూదరులు, మందు బాబులకు అడ్డాగా మారింది. ఖాళీగా ఉండటంతో రాత్రి వేళల్లో దాంట్లో మద్యం తాగడం, గుట్కాలు నమలడం, పేకాట ఆడటం వంటివి చేస్తున్నారు. ప్రాంగణం మొత్తం దుర్వాసన వస్తున్నా అధికారులు ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారు. భవనంలోని విద్యుత్ పరికరాలు, సామగ్రిని ధ్వంసం చేస్తున్నారు. అల్లరిమూకలు చేరి నానా రచ్చ చేస్తున్నారు. రాత్రి వేళల్లో మహిళలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు.

రోడ్లపైనే అమ్మకాలు..

తొర్రూరులో పట్టణంలోని మార్కెట్‌ను వినియోగించకపోవడంతో రోడ్లపైనే కూరగాయలు, మాంసం, చేపల విక్రయాలు కొనసాగుతున్నాయి. పట్టణంలోని మెయిన్ రోడ్డు, హరిపిరాల రోడ్డు, బస్టాండ్ సెంటర్, అన్నారం రోడ్డు, అంబేడ్కర్ సెంటర్ హైస్కూల్ పరిసర ప్రాంతాల్లో కూరగాయలు, మాంసం, చేపల విక్రయాలు కొనసాగిస్తున్నారు. మార్కెట్‌లో విక్రయాలు జరగవని భావించి వ్యాపారులు రోడ్ల పైనే అమ్మకాలు జరుపుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మార్కెట్‌లో నిర్మించిన మూత్రశాలలకు నీటి సరఫరా లేక కూరగాయల క్రయవిక్రయాల కోసం వచ్చే స్థానికులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతోపాటు గొంతు తడుపుకునేందుకు మంచినీటి సౌకర్యం సైతం మార్కెట్‌లో లేదు.

దుకాణాల కేటాయింపునకు కృషి



తొర్రూరులోని ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తాం. లాటరీ ద్వారా దుకాణాలు కేటాయించి అన్నీ ఒకేచోట ఉండేలా చూస్తాం. రెండో బ్లాక్‌లో నాన్‌వెజ్ దుకాణాల ఏర్పాటుకు వ్యాపారులు ఆసక్తి చూపడం లేదని తెలిసింది. దీనిపై స్థానిక ఎమ్మెల్యే, ఉన్నతాధికారులతో మాట్లాడి పూర్తి స్థాయిలో మార్కెట్ కొనసాగేలా చర్యలు తీసుకుంటాం.

-శాంతికుమార్, తొర్రూరు మున్సిపల్ కమిషనర్

యేసు మార్గంలో నడవాలి



వేడుకలకు హాజరైన క్రీస్తు ఆరాధకులు



ప్రసంగిస్తున్న బిషప్ డాక్టర్ ఉడుముల బాల

- బిషప్ ఉడుముల బాల

మహబూబాబాద్ రూరల్: యేసుక్రీస్తు మార్గంలో నడవాలని వరంగల్ క్యాథలిక్ పీఠాధిపతి, మేత్రాసనం మహాఘన బిషప్ ఉడుముల బాల అన్నారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి శనిగపురం గ్రామంలోని యేసుగుట్ట వద్ద ఆదివారం బంజారా మెగా క్రిస్మస్ సంబురాలు ఘనంగా నిర్వహించారు. కరుణామయి మరియామాత పుణ్యక్షేత్రంలో బిషప్ ఉడుములబాల ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మరియామాతను ప్రత్యేకంగా తయారు చేసిన పల్లకీలో భక్తులు ఊరేగించారు. భక్తి పాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు, నాటికలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. మానుకోట ఫాతిమా మాత దేవాలయ విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ సైమన్ ఆధ్వర్యంలో జరిగిన సంబురాలకు ముఖ్య అతిథిగా బిషప్ ఉడుముల బాల హాజరై క్రీస్తు ఆరాధకులను ఉద్దేశించి ప్రసంగించారు. సమాజంలో శాంతి నెలకొనేందుకు యేసు క్రీస్తు ఎంతో ఆరాటపడ్డారని, మనం కూడా క్రీస్తు చూపిన మార్గంలో నడవాలన్నారు. మనుషుల మధ్య సంబంధం, దేవుడికి భక్తులకు మధ్య సంబంధం మేలు జరిగే విధంగా ఉండాలన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖఃశాంతులతో జీవించాలని ప్రార్థించారు. వివాహం, కుటుంబం వ్యవస్థను దేవుడు ఏర్పాటు చేశారన్నారు. క్రైస్తవ జీవితంలో బైబిల్ పఠనం మేలు చేస్తుందన్నారు. అనంతరం దివ్యాంగులకు నిత్యావసర సరుకులు, బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, స్థానిక కౌన్సిలర్ బానోత్ హరిసింగ్, గునీలియన్ సుపీరియర్ ఫాదర్ రోనాల్డ్, టీసీబీసీ ట్రైబల్ సెక్రటరీ ఫాదర్ జోనస్, శనిగపురం యేసుగుట్ట ఫాదర్ పాల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లులకు తనివితీరా మొక్కులు



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



సమ్మక్క గద్దె వద్ద మొక్కుతున్న భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి. పాటిల్ దంపతులు

- మేడారానికి భారీగా భక్తులు
- సుమారు 5వేల మంది రాక

ఎస్ఎస్‌తాడ్వాయి : మేడారం సమ్మక్క–సారలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా జంపన్న వాగు స్నానఘట్టాల వద్ద స్నానాలు చేశారు. కల్యాణ కట్టలో పుట్టు వెంట్రుకలు సమర్పించారు. అమ్మవార్ల గద్దెల వద్ద కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పరిసరాల చెట్ల కింద వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు అమ్మవార్లను దర్శించుకున్నారు. కాగా, సుమారు 5వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. దేవాదాయశాఖ జూనియర్ అసిస్టెంట్లు జగదీశ్వర్, రఘుపతి పూజారులకు సేవలదించారు.

అమ్మవార్లను దర్శించుకున్న కలెక్టర్లు..

సమ్మక్క, సారలమ్మను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ దోత్రేలు కుటుంబ సమేతంగా వేర్వేరుగా అమ్మవార్లను దర్శించుకున్నారు. కాగా, సంప్రదాయం ప్రకారం పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు డోలి వాయిద్యాలతో కలెక్టర్లను గద్దెలపైకి స్వాగతించారు. పూజారులు కొక్కెర రమేశ్, కాక సారయ్య ఉన్నారు.

నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

- ఎజెండాలో 187 ప్రతిపాదనలు
- ఎక్కువగా పెట్రోలు, డీజిల్, వెల్డింగ్, మరమ్మతుల బిల్లులు



మున్సిపాలిటీ కార్యాలయం

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ కార్యాలయంలో ఈనెల 23న ఉదయం 10.30గంటలకు కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నారు. 187 ప్రతిపాదనలతో కూడిన ఎజెండాను తయారు చేసి కౌన్సిలర్లకు అందజేశారు. ఎజెండాలో పెద్దగా ప్రాధాన్యత ఉన్న అంశాలు లేవు. మొదటి, రెండో ప్రతిపాదనలు పశుసంత వేలం పాట ప్రకటనల బిల్లులు ఉన్నాయి. సీసీరోడ్లు, డ్రెయినేజీ పనులవి కొన్ని ప్రతిపాదనలు ఉండగా.. మరికొన్ని లైటింగ్, సౌండ్ సిస్టమ్ డెకరేషన్ బిల్లులు ఉన్నాయి. 2024 సెప్టెంబర్‌లో డీజిల్, పెట్రోలు, రూ.2,66,627 బిల్లులు, అక్టోబర్‌లో రూ.2,83,351, నవంబర్‌లో రూ.3,67,025 బిల్లులు ఉన్నాయి. వాటితో పాటు ఫాగింగ్ వాహనాల డీజిలు బిల్లులు మాత్రమే ఉన్నాయి. అలాగే విగ్రహాల ప్రారంభోత్సవాలకు అయ్యే ఖర్చుల బిల్లుల ప్రతిపాదనలు మాత్రమే పొందుపర్చారు. గ్రీన్ ల్యాండ్‌లు, ఇంటి నంబర్లు, అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు, మాజీ సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ.50 కోట్లు తదితర అంశాలపై ఎక్కువ చర్చ జరిగే అవకాశం ఉంది.

షెడ్యూల్ ప్రకారం విధులు నిర్వర్తించాలి



మాట్లాడుతున్న అధికారి బాలమాయాదేవి, పక్కన కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్: ఎన్నికల కమిషన్ సూచనల ప్రకారం క్షేత్రస్థాయిలో షెడ్యూల్ ప్రకారం ఎన్నికల విధుల నిర్వర్తించాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బాలమాయాదేవి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆదివారం స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫామ్–6,7,8లను వెంటనే పరిష్కరించాలని, దివ్యాంగ ఓటర్లను గుర్తించాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. నాణ్యమైన ఓటర్ ఎపిక్ కార్డులను ప్రింట్ చేసి పంపిణీ చేయాలన్నారు. అన్ని విద్యా సంస్థల్లో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అందుకు తగు ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగుల కోసం ర్యాంప్‌లు, తాగునీరు, మరుగు దొడ్లు, విద్యుత్‌సరఫరా, అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ.. షెడ్యూల్ ప్రకారం పక్కా ప్రణాళికతో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి, ఆర్డీఓలు గణేష్, కృష్ణవేణి, స్వీప్ నోడల్ అధికారి మధుసూదన్‌రాజు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మండలిలో ఉపాధ్యాయుల గళం వినిపిస్తా..

- ఎమ్మెల్సీ అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

తొర్రూరు: ఎమ్మెల్సీగా తనకు అవకాశమిస్తే మండలిలో ఉపాధ్యాయుల గళం సమర్థంగా వినిపిస్తానని తెలంగాణ పీఆర్‌టీయూ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో ఆదివారం రాత్రి తెలంగాణ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రఘురెడ్డితో కలిసి హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడారు. గతంలో ఎమ్మెల్సీలుగా పని చేసిన నాయకులు ఉపాధ్యాయుల సమస్యలు విస్మరించారన్నారు. వారి నిర్వాకం వల్లే 317 జీఓ వచ్చిందని, వేతనాల్లో ఆలస్యం జరిగిందన్నారు. తమ కృషితో భాషా పండితులకు పదోన్నతులు లభించాయని గుర్తు చేశారు. ఉపాధ్యాయ అపరిష్కృత సమస్యలపై ప్రభుత్వంతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఇమామ్ మహ్మద్, రాష్ట్ర నాయకులు శ్రవణ్‌కుమార్ రెడ్డి, చక్రారెడ్డి, భూపతిసింగ్, ఓం ప్రకాశ్, వివేక్, శ్యామ్‌బాబు, శిరీష పాల్గొన్నారు.

మిగిలింది 34 రోజులే..

- నిరాశలో మానుకోట మున్సిపాలిటీ పాలక మండలి
- ఆశించినమేర అభివృద్ధి చేయలేదని ఆవేదన
- మళ్లీ పోటీ చేయాలనే ఆలోచన ఉన్న వారు మాత్రమే వార్డు సమస్యలపై దృష్టి
- రిజర్వేషన్లు మారుతాయనే ప్రచారం



మానుకోట పట్టణ వ్యూ

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పాలక మండలి పదవీకాలం 34రోజుల్లో ముగియనుంది. అయితే ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేదని పాలకవర్గం నిరాశలో ఉంది. పట్టణ ప్రగతి నిధులు రాకపోవడంతో పాటు మాజీ సీఎం కేసీఆర్ మున్సిపాలిటీకి ప్రకటించిన రూ.50 కోట్లు రాకపోవడంతో ఆశించినస్థాయిలో అభివృద్ధి చేయలేకపోయామని చాలా మంది కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ పోటీ చేయాలనే ఆలోచన ఉన్న వారు మాత్రమే వారి వార్డులో తిరిగి సమస్యలు పరిష్కరించి, పనులు చేయిస్తున్నారు. పోటీచేయాలనే ఆలోచన లేని వారు వార్డులను గాలికి వదిలేశారు.

2020 జనవరిలో ఎన్నికలు..

2020 జనవరి 22న ఎన్నికల పోలింగ్, 25న లెక్కింపు జరిగింది. ఈ ఎన్నికలకు ముందు మానుకోట మున్సిపాలిటీలో ఈదులపూసపల్లి, జమాండ్లపల్లి, అనంతారం, బేతోలు, రజాలిపేట, శనిగపురం గ్రామాలను విలీనం చేశారు. దీంతో వార్డుల సంఖ్య 28నుంచి 36కు పెరిగింది. ఈక్రమంలో రిజర్వేషన్లు మారాయి. ఎస్టీ 7, ఎస్సీ 5, బీసీ 6, జనరల్‌మహిళా 10, జనరల్ 8 చేశారు. చైర్మన్ జనరల్‌గా రిజర్వ్ అయింది. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ 19వార్డులు, కాంగ్రెస్ 10, సీపీఐ 2, సీపీఎం 2, స్వతంత్రులు 3వార్డుల్లో గెలుపొందారు. జనవరి 27న కౌన్సిలర్ ప్రమాణ స్వీకారం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి చైర్మన్‌గా, మహ్మద్ ఫరీద్ వైస్ చైర్మన్‌గాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం..

ఈ ఏడాది మార్చి 4న వైస్ చైర్మన్‌పై బీఆర్ఎస్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టాలని తీర్మానం చేసి మున్సిపాలిటీతో పాటు కలెక్టర్‌కు తీర్మాన పత్రాలు అందజేశారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు తిరుగుబాటు చేశారు. అదే నెల 26న కార్యాలయంలో అవిశ్వాసం నెగ్గడంతో ఫరీద్‌ను వైస్‌చైర్మన్ పదవి నుంచి తొలగించారు. మార్నేని వెంకన్న ఏకగ్రీవంగా వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

వచ్చే నెల 26న ముగియనున్న పదవీకాలం..

2025 జనవరి 26న పాలకమండలి పదవీకాలం ముగుస్తుంది. 34 రోజుల వ్యవధి మాత్రమే. ఆతర్వాత ఎన్నికల వచ్చేంత వరకు ఇన్‌చార్జ్ పాలన కొనసాగుతుంది. 2023 జూన్ నుంచి పట్టణ ప్రగతి నిధులు రావడం లేదు. ప్రతీనెల రూ.46లక్షలు వచ్చేది. ఆనిధులు నిలిచిపోవడంతో సమస్యలు పెరిగాయి. ఇతర ఎలాంటి నిదులు రాకపోవడంతో చేసిన పనుల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పాలక మండలిలో నిరాశే మిగిలింది. మాజీ సీఎం కేసీఆర్ 2023 జనవరి 12న సీఎం హోదాలో జిల్లాలో పర్యటించి మానుకోట మున్సిపాలిటీకి రూ.50కోట్లు ప్రకటించారు. కానీ ఆ నిధులు విడుదల కాలేదు. దీంతో ఆశించినంత అభివృద్ధి జరగలేదని పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రిజర్వేషన్లు మారుతాయనే ప్రచారం..

గత రెండు ఎన్నికల్లో రిజర్వేషన్లు మారాయి. ఈసారి కూడా రిజర్వేషన్లు మారుతాయనే ప్రచారం జోరుగా జరుగుతోంది. రిజర్వేషన్లు మారితే గెలుస్తామా లేదా అనే అని ఆశావహులు అంచనాలు వేసుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న వార్డుల్లో అభివృద్ధి చేసిన వారు వార్డు మారితే చేసిన వార్డులో అభివృద్ధిని చూసి ఓటు వేయాలని అభ్యర్థిస్తామని చెబుతున్నారు. కాగా జిల్లా కేంద్రం మానుకోట మున్సిపాలిటీ కాబట్టి అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు అన్ని పార్టీలు సవాల్‌గా తీసుకుని పని చేసే అవకాశం ఉంది.

పరిశోధన పత్రం సమర్పణ



విద్యారణ్యపురి: జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని ఎస్‌సీఈఆర్‌టీలో ఈనెల 21న నిర్వహించిన రాష్ట్రస్థాయి మేథమెటిక్స్ సెమినార్‌లో కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్ పోగుల అశోక్ పరిశోధన పత్రం సమర్పించారు. (పేపర్ ప్రజెంటేషన్) 'ఎన్‌హాన్సింగ్ క్వాలిఫికేషన్ టెక్నిక్స్ ఇన్ సెకండరీ స్కూల్స్ స్టూడెంట్స్ త్రూ వేదిక్ మేథమెటిక్స్' అంశంపై పరిశోధన పత్రం సమర్పించారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ గాజర్ల రమేశ్ సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. ఇదిలా ఉండగా.. పోగుల అశోక్ వచ్చే నెలలో జాతీయ స్థాయిలో జరగబోయే విద్యా సదస్సులోనూ పాల్గొనేందుకు ఇప్పటికే ఆయనకు అవకాశం లభించింది. జాతీయ సదస్సుకు ఎంపికైన పోగుల అశోక్‌ను విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి ఈసందర్భంగా అభినందించారు.

'సంప్రదాయాలను కాపాడుకోవాలి'



మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

ఎస్ఎస్‌తాడ్వాయి: ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని సమ్మక్క పూజారి సిద్ధబోయిన అరుణ్‌కుమార్ అన్నారు. వనవాసీ కల్యాణ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం మేడారంలో సమ్మక్క భవనంలో ఆదివాసీ పూజారులతో సంస్కృతి పరిరక్షణపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమ్మక్క– సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజు పూజారులను, గ్రామస్థాయిలో ఉన్న పూజారులను కాపాడుకోవాలన్నారు. పూజారుల ద్వారా సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ జరుగుతుందని, ప్రజలలో ఐక్యత వస్తుందని తెలిపారు. వనవాసీ కల్యాణ పరిషత్ ప్రాంత శ్రద్ధ జాగరణ ప్రముఖ్ పరుశురాములు, సమ్మక్క– సారలమ్మ ఆవాస ప్రముఖ్ సాంబయ్య, చర్పా కిసాన్‌రావు, కార్యదర్శి మైపతి సంతోష్ పాల్గొన్నారు.

మతోన్మాద విధానాల్ని వ్యతిరేకించండి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

న్యూశాయంపేట: బీజేపీ మతోన్మాద విధానాల్ని వ్యతిరేకించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. ఆదివారం హనుమకొండలోని పార్టీ ఆఫీస్‌లో జిల్లా కమిటీ సభ్యుడు చక్రపాణి అధ్యక్షతన విస్తృత సమావేశం నిర్వహించారు. నాగయ్య మాట్లాడుతూ.. మతోన్మాద భావజాలాన్ని ప్రజల్లోకి చొప్పించడం వీలు కావడం లేదనే కుట్రతో అప్పుడప్పుడు బీజేపీ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తోందన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో ఒక్కొక్కరు నిందలు వేసుకోవడం తప్ప ప్రజా సమస్యలపై చర్చలు లేవన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు వాసుదేవరెడ్డి, చుక్కయ్య, వెంకట్, వీరన్న, రాములు తిరుపతి, దీప్ లింగయ్య, భానునాయక్ ఉన్నారు.

క్లుప్తంగా

తోటి తెగ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా రఘు



తోటి తెగ ఉమ్మడి జిల్లా కార్యవర్గం

గీసుకొండ: గీసుకొండ మండలంలోని జాన్‌పాకలో ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆదివాసీ తోటి తెగ సేవ సంఘం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా గుర్రం రఘు, గౌరవ అధ్యక్షుడిగా సోమ సాంబయ్య, ఉపాధ్యక్షులుగా ఆకుల రమేశ్, గుర్రం హరీశ్, సోయం వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శిగా గుర్రం మధు, సహాయ కార్యదర్శులుగా షెడ్మాకి సదానందం, గుర్రం అజయ్, కోశాధికారిగా ఆకుల యాదగిరి, ప్రచార కార్యదర్శులుగా గుర్రం రాజశేఖర్, గేడెం క్రాంతి, సోయం శరత్‌బాబు, మరో ఎనిమిది మందిని కార్యవర్గ సభ్యులు, సలహాదారులుగా ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు తెలిపారు.

కేయూ ఇయర్ వైజ్ స్కీం

- ఒక్కోపేపర్‌కు రూ.4వేల ఫీజు
- ఫిబ్రవరి ఒకటి వరకు అవకాశం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ కోర్సుల ఇయర్‌వైజ్ స్కీం విద్యార్థులకు బ్యాక్‌లాగ్ సబ్జెక్టుల పరీక్షలు రాసుకునేందుకు ఫీజు చెల్లించేందుకు పరీక్షల విభాగం అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. బీఏ, బీబీఎం, బీకాం, బీఎస్సీ, బీఏ(ఎల్), బీసీఏ, బీ ఒకేషనల్ నాన్ ప్రొఫెషనల్ కోర్సుల ఇయర్‌వైజ్ స్కీం విద్యార్థులు బ్యాక్ లాగ్ సబ్జెక్టుల పరీక్షలు రాసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ తిరుమలాదేవి, డాక్టర్ వెంకటయ్య తెలిపారు. ఒక్కో పేపర్‌కు రూ.4 వేల ఫీజు చెల్లించాల్సింటుందని, అపరాధ రుసుము లేకుండా ఫిబ్రవరి 1 వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. మిగతా వివరాలకు క్యాంపస్‌లోని పరిపాలన భవనం అకడమిక్ బ్రాంచ్‌లో సంప్రదించాలని, పరీక్షల నిర్వహణ ఎప్పుడనేది తరువాత ప్రకటిస్తామన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని దుప్పి మృత్యువాత



ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారం–తాడ్వాయి మార్గంలో గట్టమ్మ గుడి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆదివారం తెల్లవారుజామున ఓ దుప్పి మృత్యువాత పడింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న రేంజ్ అధికారి నరేందర్, సెక్షన్ ఆఫీసర్ లింగయ్య ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. దుప్పిని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించి పశువైద్యాధికారితో పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు. కాగా, గుర్తుతెలియని వాహనం ఢీకొని మృత్యువాత పడి ందా లేక ఇతర కారణాలతో మృత్యువాత పడిందా అనే అంశంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రేంజ్ అధికారి నరేందర్ తెలిపారు.



నిను మరవలేదు ఈ గడ్డ!

వంగర బిడ్డ మన పీవీ..

- దేశ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి
- తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలు దాటించిన మహానేత
- తెలుగుజాతి గర్వించ దగిన నాయకుడు.. ప్రజల గుండెల్లో ఇంకా పదిలం
- నేడు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు 20వ వర్ధంతి



వంగరలో పీవీ ఇల్లు. ఇన్‌సెట్‌లో ఆయన వాడిన కారు



పీవీ నర్సింహారావు

ఎల్కతుర్తి : పాములపర్తి వెంకట నర్సింహారావు.. ఆ పేరు ఎరగని వారు ఉండరు. భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర ముద్దుబిడ్డ కా వడం గర్వకారణం. సమాచార, ఆర్థిక సంస్కరణలకు బీజం వేసిన ఆయన పేరును ఇప్పటికీ దేశవ్యాప్తంగా పరోక్షంగా, ప్రత్యక్షంగా ఉచ్చరిస్తూనే ఉంటారు. దేశ రాజకీయాల్లో చెరగని ముద్రవేసుకు న్న బహుముఖ ప్రజ్ఞాశాలి.. బహుభాషాకోవిదు డు.. తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిన మహా మేధావి.. భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు వర్ధంతి నేడు(సోమవారం). మౌనమునిగా పేరుగాంచిన పీవీ మన దేశానికి ఎనలేని సేవలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆయనకు సముచిత గౌరవాన్నిచ్చి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధి కారికంగా నిర్వహించింది. 2020 జూన్ 28 నుంచి 2021 జూన్ 28 వరకు పీవీ శతజయంతి ఉత్సవాలు నిర్వహించింది. కాగా, 2023 అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అధికారికంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తుండగా.. 2024 ఫిబ్రవరి 9న కేంద్రం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించింది.

ఉగ్గుపాల నుంచే ఉద్యమ బాట..

పీవీ స్వగ్రామం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర కాగా, ఆయన అమ్మమ్మగారి ఊరైన వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నెపల్లిలో 1921, జూన్ 28న జన్మించారు. పీవీ తల్లిదండ్రులు సీతారామారావు, రుక్మిణి. వేలేరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం మొదలు పెట్టిన పీవీ.. హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ పూర్తిచేశారు. కళాశాల చదువుకోసం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరారు. అక్కడ వందేమాతరం ఆలపించడంతో సహచరులతోపాటు పీవీని విశ్వవిద్యాలయం నుంచి అప్పటి నిజాం ప్రభుత్వం బహిష్కరించి.. తమ ఏలుబడిలోని ఏ ప్రాంతంలోనూ చదివేందుకు వీలు లేదని నిషేధం విధించింది. దీంతో మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించారు. బీఎస్సీ, ఎల్ఎల్‌బీ పూర్తిచేశారు. విద్యార్థి దశనుంచే నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. కొంతకాలం అజ్ఞాతవాసం ఉండి చాందా క్యాంపులో క్రియాశీలకపాత్ర పోషించారు. అనంతరం ఊహించని పరిణామాలు చోటుచేసుకోవడంతో కాంగ్రెస్‌లో చేరారు. అంచెలంచెలుగా ఎదిగి అఖిలభారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడయ్యారు.

వంగరలో నేడు వర్ధంతి

వంగరలో సోమవారం పీవీ వర్ధంతి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే వేడుకల్లో రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ వాణిదేవితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు.

ఆయనంటేనే కాంగ్రెస్..

ప్రతీ ఆపద సమయంలో పీవీ నర్సింహారావు కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధానిగా క్లిష్టసమయాల్లో బాధ్యతలు స్వీకరించారు. ముల్కీ నిబంధనలు చట్టవిరుద్ధమని చెప్పిన సుప్రీం కోర్టు తీర్పును బహిరంగంగా స్వాగతించినందుకు అప్పటి సీమాంధ్రనేతలు ఆయనపై కక్షగట్టారు. భూసంస్కరణల చట్టం అమలుకు ఏకంగా ఆర్డినెన్స్ తేవడం తెలంగాణ–ఆంధ్రా నేతలకు కంఠగింపుగా మారింది. ఫలితంగా పీవీ ముఖ్యమంత్రి పదవీచ్యుతుడయ్యారు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన భారతదేశాన్ని ప్రధానిగా తన శక్తియుక్తులతో గట్టెక్కించారు. మెజారిటీ లేని తన ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు ఎన్నో నిందలు, అవమానాలు భరించారు. రాజకీయాల్లో క్లిష్టపరిస్థితుల్లోనే ఆయన ఏ పదవిని చేపట్టినా అది ప్రజల పక్షంగానే నడిచింది. కవి, రచయిత, అనువాదకుడు, కథకుడు, పాత్రికేయుడిగా ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివి. 1951లో అఖిల భారత కాంగ్రెస్ సభ్యుడిగా మొదలు.. దేశ ప్రధాని వరకు ఆయన ప్రజల మనిషిగానే పనిచేశారు. 1996లో ప్రధానమంత్రి పదవీకాలం ముగిశాక పీవీ క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నారు. చివరకు పీవీ 2004 డిసెంబర్ 23న కన్నుమూశారు.

మరుపు వస్తలేదు..



పీవీ దొరని చూసినోళ్లు.. మాట్లాడినోళ్లు ఎప్పటికీ మరచిపోరు.. ఆయన చచ్చిపోయి ఇరవయ్యేళ్లయితన్న మరుపు వస్తలేదు. పనిచేసేవారితో ప్రతీ ఒక్కరిని మంచిగా పలుకరించేది. ఆతర్వాత పీవీ దొర హైదరాబాద్, అక్కడినుంచి ఢిల్లీకి వెళ్లి వచ్చేవారు. గ్రామంలో దవాఖాన, పోలీస్‌స్టేషన్, కరెంట్ దొరవారు చేయవట్టే ముల్కనూర్ కంటే వంగరకే ముందుగాల వచ్చింది.

- రామారపు నర్సయ్య, వంగర గ్రామస్తుడు

దొరగారి ఇంట్లో పనిచేసిన..



పీవీ దొరవారి ఇంట్లో 1975–76లో పాలేరుగా పనిచేశా. ఆయన కోళ్లఫాం పెడితే అందులోనూ పని చేసిన. దొరకు సుమారు 50ఎకరాల వరకు చెల్క ఉండేది. మొక్కజొన్న చెలుక ఎంబడి తిరుగుంటూ ఆవులను మేపేవాడిని. పీవీ దొర చాల మంచోడుండే. ముల్కనూరు కంటె ముందుగాల మా ఊళ్లకు కొన్ని సౌలతులు వచ్చినయంటే ఆయనే కారణం.

- కాల్వ మల్లయ్య, వంగర గ్రామస్తుడు

కాళోజీ జీవితం..విశ్వవ్యాప్తం

నేడు 'ప్రజాకవి కాళోజీ' చిత్రం విడుదల

- డిసెంబర్ 29 వరకు మార్నింగ్ షో విద్యార్థులకు ఉచితం
- కాళోజీ స్ఫూర్తిని రగిలించేలా బయోపిక్
- చైతన్యం చేయడమే నాలక్ష్యం: డైరెక్టర్ ప్రభాకర్ జైనీ



ప్రజాకవి కాళోజీ సినిమా పోస్టర్

హన్మకొండ కల్చరల్ : చిన్నప్పటి నుంచి వెండితెరను ఏలాలనే ఆకాంక్ష.. ఆకాంక్ష మేరకే ఓ విశ్రాంత ఉద్యోగి సినిమా బాట పట్టారు. ఉన్నత విద్య నభ్యసించి విదేశాల్లో స్థిరపడే అవకాశమున్నా ఆవైపు వెళ్లలేదు. అభిరుచితో సినిమా రంగం వైపు కదిలారు. పలు చిత్రాలు తీస్తూ తెలుగు ప్రజలను మెప్పిస్తున్నారు. పల్లెటూరు అందాలు, కుటుంబ బంధాలు, అనుబంధాలను మేళవిస్తూ సహజ దర్శక నిర్మాతగా చక్కటి సినిమాలకు ప్రాణం పోస్తున్నారు. ఆయనవే డాక్టర్ ప్రభాకర్ జైనీ.

వెండి తెరపై జైనీ..

డాక్టర్ ప్రభాకర్ జైనీ జన్మ స్థలం వరంగల్. కమర్షియల్ ట్యాక్సెస్ అసిస్టెంట్ కమిషనర్‌గా రిటైర్డ్ అయ్యారు. చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఇష్టం. ఉద్యోగం చేస్తూనే సినిమా రంగం వైపు ఎన్నో ప్రయత్నాలు చేశారు. అయినా అవకాశాలు రాలేదు. దీంతో తక్కువ బడ్జెట్‌లో సినిమా తీయాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా 'జైనీ క్రియేషన్స్' పేరుతో సినిమాలు చేయడం ప్రారంభించారు. తాను రచించిన 40 నవలలు, 250 కవితల నుంచి ప్రధాన అంశాలను తీసుకుని మూడు సినిమాలు తెరకెక్కించారు. ఈ సినిమాలను ప్రజలు ఆదరించారు. 2014లో తీసిన నవల 'నా సినిమా సెన్సార్ అయిపోయిందోచ్!'కు నంది అవార్డు లభించింది. ప్రభుత్వం నుంచి అనేక మార్లు ప్రశంసలు పొందారు. కాగా, ప్రజాకవి కాళోజీ చిత్రం 2022లో పూర్తి చేసుకుంది. ప్రస్తుతం సెన్సార్ పూర్తిచేసుకుని విడుదలకు సిద్ధమైంది.

నేడు ప్రజాకవి కాళోజీ చిత్రం విడుదల

స్వరాష్ట్ర ఉద్యమానికి ఊపిరిపోసిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకుని 'ప్రజాకవి కాళోజీ' చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమాకు నిర్మాత విజయలక్ష్మి జైనీ, కథ–మాటలు–స్క్రీన్‌ప్లే దర్శకతం ప్రభాకర్‌జైనీ వ్యవహరించారు. ఈ సినిమా తీసి ప్రజాకవి కాళోజీకి ప్రాణం పోశారు. ప్రేక్షకులకు వినోదం అందించడమే కాదు, సమాజానికి సందేశాన్నిచ్చే చక్కటి చిత్రం. సోమవారం ఉదయం 'ప్రజాకవి కాళోజీ' సినిమాను విడుదల చేస్తున్నారు. ఈ నెల 23 నుంచి ఈనెల 29 వరకు ఉదయం ఆటలలో పాఠశాలల విద్యార్థుల కోసం వరంగల్‌లో రాధిక, జెమిని, హనుమకొండలోని అశోక థియేటర్‌లో ఉచితంగా ప్రదర్శించబడుతుంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి.. డీఈఓకు పంపించారు.

వారం రోజులు ఉచితం



మంచి చిత్రాలు తీయడమే లక్ష్యంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు జీవితాన్ని సినిమాగా తెరకెక్కించా.. తక్కువ బడ్జెట్‌తో గ్రామీణ కళాకారులతో సినిమాను రూపొందించా. 'ప్రజాకవి కాళోజీ' చిత్రాన్ని వారం రోజుల పాటు ఉదయం ఆటలలో విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించాం.. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-ప్రభాకర్ జైనీ, 'ప్రజాకవి కాళోజీ' చిత్రం దర్శక, నిర్మాత

29న ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్ : వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్–17 బాలబాలికల చదరంగ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి పి. కన్నా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ ఎదుట ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిసున్న పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2008, ఆ తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. క్రీడాకారుల పేర్ల రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉద్యోగులను మోసగించడానికే యూపీఎస్

- టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ



మాట్లాడుతున్న స్థిత ప్రజ్ఞ

రామన్నపేట : ఉపాధ్యాయ, ఉద్యోగులను మోసం చేయడానికి 2025, ఏప్రిల్ 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) తీసుకొస్తోందని, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ స్టేట్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ అన్నారు. ఆదివారం వరంగల్‌లోని ఇస్లామియా కాలేజీ మైదానంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్ కుమార్ అధ్యక్షతన భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ ఆర్టికల్ 51 ప్రకారం పౌరులకు కంట్రిబ్యూషన్ లేని పెన్షన్ పొందడం హక్కు అన్నారు. పాత పెన్షన్ విధానంలో ఉద్యోగికి గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్, డీఏ ఆధారిత సర్వీస్ పెన్షన్, కమ్యూటేషన్ సౌకర్యాలను కలిగి ఉంటుందన్నారు. అదే యూపీఎస్ విధానంలో ఉద్యోగి, ప్రభుత్వ నెల వారీ కాంట్రిబ్యూషన్ ద్వారా జమైన పెన్షన్ నిధిని ఎంపీఎస్ ట్రస్ట్‌కు బదిలీ చేస్తే గాని సర్వీస్ పెన్షన్ నిర్ణయం జరగదన్నారు. ఇది తీవ్రంగా వ్యతిరేకించాల్సిన అంశమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ మాట్లాడుతూ సీపీఎస్ విధానంలో రిటైర్డ్ అయిన హైకోర్టు జడ్జి, విశ్రాంతి న్యాయమూర్తులకు కేవలం రూ.6 నుంచి రూ.15 వేల పెన్షన్ మాత్రమే అందుతుందన్నారు. సుప్రీంకోర్టు దిగ్భ్రాంతి వ్యక్తం చేసేలా ఈ నూతన పెన్షన్ విధానం ఉందన్నారు. యూనియన్ రాష్ట్ర కోశాధికారి ఈడిగి నరేశ్‌గౌడ్, ఉపాధ్యక్షులు లింగమూర్తి, బుచ్చన్న, జిల్లా నాయకులు రవీందర్ రెడ్డి, అఫ్జల్, కొండా శ్రీనివాస్, లక్ష్మణమూర్తి, దిల్షాన్, రవికాంత్, నాగముని, లక్ష్మీకాంత్, తోటావిక్రమ్, నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అర్ధశతాబ్దపు ఆత్మీయ కలయిక..





గురువును సన్మానిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పూర్వ విద్యార్థులు



వేడుకలకు హాజరైన పూర్వ విద్యార్థులు

పాఠశాల వేదికగా 50 బ్యాచ్‌ల విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

- మధుర స్మృతులు, జ్ఞాపకాలు నెమరవేసుకున్న స్నేహితులు

జఫర్‌గఢ్: ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా అర్ధ శతాబ్దపు (బ్యాచ్‌లు) విద్యార్థులంతా ఆత్మీయంగా కలుసుకున్నారు. బామ్మల వయస్సులో బాల్య మిత్రులను కలుసుకున్నారు. ఒకరినొకరు చూసుకుంటూ అతి కష్టంగా గుర్తు పట్టుకుని భావోద్వేగాలకు గురయ్యారు. 50 సంవత్సరాల బ్యాచ్‌లకు చెందిన వారందరూ ఒకే వేదిక ద్వారా కలుసుకున్నారు. ఈ అపురూప ఘటన కూనూర్ ఉన్నత పాఠశాల్లో ఆవిష్కృతమైంది. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 50 ఏళ్ల స్వర్ణోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగా యి. కాగా, పాఠశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు జరుపుకోవాలనే ఆలోచన పూర్వ విద్యార్థి నాగమల్ల అశోక్‌కు మదిలో మెదిలింది. ఈ విషయం తన బాల్యమిత్రులతో చర్చించడంతో వారు కూడా స్పందించి పాఠశాల ప్రారంభమైన 1973–74 నుంచి 2023–24 బ్యాచ్‌లకు చెందిన 4,500 మంది విద్యార్థులు, 150 మంది గురువుల వివరాలను సేకరించారు. అనంతరం ఆదివారం ఒకచోట.. ఒక వేదికపై కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ పాఠశాలలో గడిపిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

గురువులకు ఘన సన్మానం

పాఠశాల ఏర్పడినప్పటి నుంచి.. నేటి వరకు 150 మంది గురువులకు గాను వందిమంది వేడుకలకు హాజరు కావడం విశేషం. అదే విధంగా 4, 500 మంది విద్యార్థులకు సుమారు మూడు వేల కు మందికి పైగా ఈ వేడులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా గురువులను ఘనంగా సన్మానించారు.

50 ఏళ్ల స్వర్ణోత్సవ సావనీర్ ఆవిష్కరణ

పాఠశాలలో 50 ఏళ్ల నుంచి నేటి వరకు నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల విశేషాలతో కూడిన సావనీర్‌ను ఆష్కరించారు. 50 ఏళ్లకు సంబంధించిన 50 బ్యాచ్‌ల విద్యార్థుల గ్రూప్ ఫొటోలు, గురువుల అనుభవాలను పొందుపరుస్తూ ఈ సావనీర్‌ను రూపొందించారు.

స్వర్ణోత్సవ వేడుకలు అభినందనీయం..

కాగా, ఈ కార్యక్రమానికి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 50 ఏళ్ల నుంచి పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమం ఇప్పటి వరకూ ఏ పాఠశాలలో జరగలేదన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలకు 12 కంప్యూటర్లతో పాటు అదనపు గదులు, ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

ఆనందంగా ఉంది



పాఠశాలలో 50 ఏళ్ల పూర్వ విద్యార్థులకు సంబంధించిన గోల్డెన్ జూబ్లీ వేడుకలను నిర్వహిచడం ఆనందంగా ఉంది. నాతో పాటు తోటి పూర్వ విద్యార్థులు తొమ్మిది నెలల పాటు కృషి చేయడంతోనే ఈ కార్యక్రమం విజయవంతం అయ్యింది.

- నాగమల్ల అశోక్, కమిటీ కన్వీనర్

49 ఏళ్లకు కలుసుకోవడం సంతోషంగా ఉంది

పాఠశాలలో 1974 బ్యాచ్‌కి చెందిన నా బాల్యమిత్రులను 49 ఏళ్ల తరువాత కలుసుకోవడం సంతోషంగా ఉంది. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నాం.

-మత్తటి రాంరెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం

వేడుకలు జీవితాంతం గుర్తుంటాయి



18 సంవత్సరాల తరువాత ఈ వేడుకల సందర్భంగా పాఠశాలకు రావడం ఆనందంగా ఉంది. ఈ వేడుకలు నాకు జీవితాంతం గుర్తుంటాయి.

- మౌనిక, పూర్వ విద్యార్థిని

సాక్షి క్లాసిఫైడ్స్

మద్యం తాగొద్దని మందలించిన భార్య..

- మనస్తాపంతో భర్త ఆత్మహత్య



రాజు (ఫైల్)

వర్ధన్నపేట : మద్యం తాగొద్దని భార్య మందలించడంతో మనస్తాపానికి గురైన భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం వర్ధన్నపేట మునిసిపల్ పరిధిలోని డీసీ తండాలో చోటుచేసుకుంది. ఎస్సై మెరుగు రాజు కథనం ప్రకారం.. తండాకు చెందిన భూక్యా రాజు(37) బోరు యంత్రంపై పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. సంవత్సరం నుంచి కూలీ డబ్బు ఇంట్లో ఇవ్వకుండా మద్యం తాగుతున్నాడు. దీనిపై భార్య జ్యోతి.. పలుమార్లు మద్యం తాగడం వల్ల కుటుంబం గడవడం కష్టంగా ఉంది, ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని రాజును వారించేది. అయినా పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో ఆదివారం మద్యం తాగి వచ్చిన రాజును మందలించింది. అనంతరం మధ్యాహ్నం పనినిమిత్తం బయటకు వెళ్లగా రాజు ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో పోస్టుమెన్ మృతి



అబ్బాస్ అలీ (ఫైల్)

నెల్లికుదురు : విద్యుత్ షాక్‌తో ఓ పోస్టుమెన్ మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలో ని రాజులకొత్తపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ బాబు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎండీ అబ్బాస్ అలీ (59) పోస్టుమెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. మూడు నెలల క్రితం గృహప్రవేశం చేశాడు. పాత ఇంటిపై కోతులు ఎగరడంతో రేకులు కిందికి జారాయి. వాటిని సరిచేస్తున్న క్రమంలో గమనించక పైనఉన్న విద్యుత్ తీగలను తాకాడు. దీంతో విద్యుత్ షాక్ తగిలి కింద పడ్డాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే విద్యుత్ నిలిపివేసి చూడగా అప్పటికే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య యాకూబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృత దేహాన్ని పంచనామా నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థుల వివాదంపై కమిటీ నియామకం

కేయూ క్యాంపస్: కేయూలో బీపీఈడీ , ఎంబీఏ విద్యార్థుల మధ్య ఇటీవల వివాదం తలెత్తిన విషయం విదితమే. క్రీడామైదానంలో ఎంబీఏ విద్యార్థులు క్రికెట్ ఆడుతుండగా పలువురు బీపీఈడీ స్టూడెంట్స్ వచ్చి తాము ఆడుకోవాల్సిన గ్రౌండ్‌లోమీరెలా ఆడుతారని అడ్డుకుని వాగ్వావాదానికి దిగి కొట్టారని ఆరోపిస్తూ ఎంబీఏ విద్యార్థులు ఆందోళన చేసి రిజిస్ట్రార్ మల్లారెడ్డికి విన్నవించిన విషయం విదితమే. ఈ ఘటనపై విచారించడానికి కమిటీని నియమించినట్లు రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఆదివారం తెలిపారు. చైర్మన్‌గా క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్ లాల్, సభ్యులుగా కామర్స్,బిజినెస్‌మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ అమరవేణి, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ ఏటీబీటీప్రసాద్, స్టూడెంట్స్ వెల్ఫేర్ డైరెక్టర్ నిరంజన్ శ్రీనివాస్ ఉన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

- 15 మంది నుంచి రూ.1.76 కోట్లు వసూలు
- తప్పుడు నియామక పత్రాలతో వంచన
- రెండేళ్లుగా తప్పించుకుని తిరుగుతున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు

మహబూబాబాద్ రూరల్ : విద్యుత్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి పలువురి వద్ద భారీ మొత్తంలో వసూలు చేసి మోసం చేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు మహబూబాబాద్ రూరల్ సీఐ పి.సర్వయ్య ఆదివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కురవి మండలం మొగిలిచెర్ల గ్రామానికి చెందిన ఇరుకులపాటి నాగేశ్వరరావు ఖమ్మం జిల్లా కేంద్రం చైతన్యనగర్ ప్రాంతంలో నివాసముంటూ ప్రైవేట్ అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాకకు చెందిన మండల సహోదర్ రెడ్డి హైదరాబాద్ పరిధి మేడ్చల్ రామంతపూర్ ప్రాంతంలో నివాసం ఉంటూ ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈ ఇద్దరితోపాటుగా మరికొంతమంది కలిసి రాష్ట్ర విద్యుత్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి 15 మంది నిరుద్యోగ యువకుల నుంచి రూ.1.76 కోట్లు వసూలు చేశారు. బాధితులను మభ్యపెట్టి డబ్బులు వసూలు చేయడమే కాకుండా తప్పుడు నియామక పత్రాలు ఇచ్చి చీటింగ్ చేశారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా మహబూబాబాద్ టౌన్, రూరల్, కురవి, బయ్యారం పోలీసుస్టేషన్ల పరిధిలో ఐదు కేసులు నమోదుకాగా విచారణ చేపట్టారు. రెండేళ్ల నుంచి తప్పించుకుని తిరుగుతున్న నాగేశ్వరరావు, సహోదర్ రెడ్డిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు. జిల్లాలోని వివిధ పీఎస్‌ల పరిధిలో నమోదైన ఐదు కేసుల్లో వీరు ముద్దాయిలు. కేసు విచారణలో ఉందని.. ఇందులో ఉన్న మిగతా నిందితులను అరెస్టు చేస్తామని సీఐ సర్వయ్య తెలిపారు.

ఉద్యోగం ఆశచూపి బురిడీ

- రూ.2.50 లక్షలు వసూలు..
- తిరిగి ఇవ్వకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

నర్సంపేట రూరల్: ఉద్యోగం ఇప్పిస్తాని ఓ మహిళ నుంచి రూ.2.50లక్షలు కాజేసిన సంఘటన వరంగల్ జిల్లా నర్సంపేటలో చోటు చేసుకుంది. బాధితురాలు శృతి కథనం ప్రకారం.. నర్సంపేట పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో బుడిగొండ శృతిరమేశ్ దంపతులు నివాసం ఉంటున్నారు. శృతి బీకాం కంప్యూటర్ విద్యనభ్యసించి ఉద్యోగం కోసం నిరీక్షిస్తున్నది. ఈ క్రమంలో వీరి ఇంటి సమీపాన ఉంటున్న వావిళ్ల ప్రసాద్‌కుమార్ ఏడాది క్రితం నర్సంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం స్కానింగ్ సెక్షన్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని, ఇందుకు రూ.2.50లక్షల ఖర్చు అవుతాయని నమ్మించి నమ్మించి శృతి, ఆమె భర్త రమేశ్ నుంచి వసూలు చేశాడు. ఉద్యోగం కోసం కొద్ది రోజులు శిక్షణ తీసుకోవాలని చెప్పి.. కొందరు వ్యక్తులతో స్థానిక ఎస్‌బీఐ కార్యాలయం సమీపాన వరంగల్‌కు చెందిన ఓ బ్రోకర్ సాయంతో శిక్షణ ఇప్పించారు. అనంతరం గత అక్టోబర్ 28న అపాయింట్‌మెంట్ లెటర్ శృతికి ఇవ్వగా.. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్తే లెటర్ నకిలీదని తెలపడంతో ప్రసాద్‌ను నిలదీయగా తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో బాధితురాలు నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.